
సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 26 । ఏప్రిల్ । 2023



...అపహాస్యం చేసేలా

శిక్షణ, ఉపాధి కల్పించేందుకు ఐటీడీఏలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం గిరిజన యువత ఆకాంక్షను అపహాస్యం చేస్తోంది. 10లో



కరోనా కేసులు.. 5

చుంచుపల్లి: జిల్లాలోమంగళవారం 259 మందికి పరీక్షలు నిర్వహించగా ఐదుగురికి కరోనా పాజిటివ్‌గా తేలింది.

గరిష్టం / కనిష్టం
38° / 24°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఎండ తీవ్రత ఉంటుంది. ఒకటి, రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎమ్మెల్యే ఫ్లెక్సీలో కాళ్ల వద్ద కేసీఆర్ ఫొటో



ఫ్లెక్సీలో ఎమ్మెల్యే పాదాల వద్ద సీఎం కేసీఆర్ ఫొటో

అశ్వారావుపేట: బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా నియోజకవర్గాల్లో సభలు ఏర్పాటుచేశారు. ఇందులో భాగంగా అశ్వారావుపేటలో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఫ్లెక్సీ పాదాల వద్ద సీఎం కేసీఆర్ ఫొటో పెట్టగా.. ఫొటో తీసిన కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో నాయకులు కేసీఆర్ చిత్రపటాన్ని కుర్చీల వెనుక పడేశారు. సమావేశం జరుగుతుండగానే ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు ఫోన్ రావడంతో వెనక్కి వెళ్లిన ఆయన కొందరిని మందలించినట్లు తెలిసింది. ఇక ఫ్లెక్సీలో మాజీ ఎమ్మెల్సీ జలగం వెంగటరావు ఫొటో లేకపోవడాన్ని నాయకులు పలువురు తప్పుపట్టారు.

నేటి నుంచి పీసీసీఎఫ్ పర్యటన

పాల్వంచరూరల్: అటవీ శాఖ కంపా విభాగం ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పీసీసీఎఫ్) లోకేష్ జైస్వాల్ బుధ, గురువారాల్లో అటవీశాఖ పాల్వంచ డివిజన్, కిన్నెరసాని అభయారణ్యం పరిధిలో పర్యటిస్తారని ఎఫ్‌డీఓ తిర్మల్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండాలపాడు బీట్‌లో అటవీ అభివృద్ధి పనులు, అడవి సంరక్షణను పరిశీలించనున్నారు. యాక్షన్‌ప్లాన్‌పై అటవీశాఖ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

చలమల శ్రీనివాసరావు భవనం ప్రారంభం..

చండ్రుగొండ : మండల కేంద్రం చండ్రుగొండలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో నూతనంగా నిర్మించిన అటవీశాఖ రేంజ్ కార్యాలయం బుధవారం పీసీసీఎఫ్ లోకేష్ జైస్వాల్ ప్రారంభిస్తారని రేంజర్ ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయానికి విధి నిర్వహణలో హతమైన చల్లమల శ్రీనివాసరావు భవనంగా పేరుపెట్టినట్లు పేర్కొన్నారు. సీసీఎఫ్ భీమానాయక్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

జిల్లా కోర్టులో క్యాంటీన్ ప్రారంభం



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల కోసం నిర్మించిన నూతన క్యాంటీన్‌ను మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసువులేటి చంద్రశేఖర ప్రసాద్ ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్, ఉపాధ్యక్షుడు దుండ్ర రమేష్, ప్రధాన కార్యదర్శి రావిలాల రామారావు, సహాయ కార్యదర్శి కాసాని రమేష్, లైబ్రరీ సెక్రటరీ యాస యుగంధర్, స్పోర్ట్స్ కార్యదర్శి పిట్టల రామారావు, ట్రెజరర్ సంతోష్‌లాల్ సాహూ, మహిళా రిప్రెజెంటేటివ్ అత్తులూరి మనోరమ, అసిస్టెంట్ గవర్నమెంట్ లీడర్ ఏపూరి బాబూరావు, సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు చెక్కుల అందజేత

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం టూటౌన్, ట్రాఫిక్ పోలీసు స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తూ మృతిచెందిన పోలీసుల కుటుంబాలకు ఎస్పీ డాక్టర్ వినీత్ పరిహారం నగదు చెక్కులను మంగళవారం అందజేశారు. టూటౌన్ ఏఎస్సైగా పనిచేస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన శ్రీనివాసరావు కుటుంబానికి రూ.1,00,000 చేయూత నగదును, అనారోగ్య కారణాలతో మృతిచెందిన పి.నర్సింహారావు కుటుంబానికి రూ.4,00,000 నగదు చెక్కులను ఎస్పీ తన కార్యాలయంలో అందించారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యాలయ సూపరింటెండెంట్ సత్యవతి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ మధు పాల్గొన్నారు.

‘టెరి’తో బేఫికర్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసర సేవల పథకం

- హార్ట్, ట్రామా విభాగాల్లో ఆధునిక సేవలు
- అంబులెన్సులు, ఆస్పత్రుల్లో అధునాతన పరికరాలు
- తొలిదశలో కొత్తగూడెం ఆస్పత్రిలో అమలు..



కొత్తగూడెంలోని సర్వజన ఆస్పత్రి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: విస్తరించిన ఏజెన్సీ ప్రాంతం, సింగరేణి, కేటీపీఎస్, బీటీపీఎస్, ఐటీసీ వంటి భారీ పరిశ్రమలు కొలువై ఉండటంతోపాటు జిల్లా మీదుగా రెండు జాతీయ రహదారులు పోతున్నాయి. ఇంత విభిన్నత కలిగిన జిల్లాలో అత్యవసర వైద్యసేవలు ఇటు ప్రభుత్వ, అటు ప్రైవేటు పరంగా అందుబాటులో లేవు. రాష్ట్ర ప్రభుత్వం అతి త్వరలో ప్రవేశపెట్టబోతున్న తెలంగాణ ఎమర్జెన్సీ రెస్పాన్స్ ఇనిషియేషన్ (టెరి) పథకంతో ఈ లోటు తీరనుంది.

సాధారణ సేవలే..

తాజా జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో మొత్తం 10.69 లక్షల జనాభా ఉంది. ఇందులో 68 శాతం జనాభా అంటే 7.30 లక్షల మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఏజెన్సీ జిల్లా కావడంతో ఇక్కడ ప్రభుత్వ, ప్రైవేటు పరంగా సాధారణ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. రోడ్డు, అగ్ని ప్రమాదాలు, గుండె జబ్బు, మాతాశిశు సమస్యలకు సంబంధించిన అత్యవసరన సేవలు అందుబాటులో లేవు. జిల్లా వ్యాప్తంగా ఇక్కడున్న వారికి వైద్య సేవల పరంగా అత్యవసర పరిస్థితి వస్తే భద్రాచలం, కొత్తగూడెం పట్టణాల్లో కొద్దిమేర సేవలు అందుబాటులో ఉన్నాయి. అక్కడ కూడా అత్యవసర ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన , అధునాత వైద్యం కోసం ఖమ్మం, వరంగల్, హైదరాబాద్‌లకు రిఫర్ చేస్తున్నారు. ఇక్కడి నుంచి అయా ప్రాంతాలకు అంబులెన్సుల్లో వెళ్లేలోగా విలువైన సమయం వృథా అవుతోంది.

రెండు రకాలుగా ‘టెరీ’ సేవలు..

ప్రభుత్వ పరంగా అత్యవసర వైద్య సేవలు అందించేందుకు తెలంగాణ ఎమర్జెన్సీ రెస్పాన్స్ ఇనిషియేషన్ (టెరి) పేరుతో సరికొత్త కార్యక్రమాన్ని అమలు చేయబోతున్నారు. అందులో భాగంగా ఎంపిక చేసిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రకృతి విపత్తులు, రోడ్డు, అగ్ని ప్రమాదాల్లో గాయపడిన వారికి, హార్ట్ ఎటాక్ గురైన వారికి అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి తెస్తారు. ఈ సేవలు రెండు రకాలుగా ప్రజలకు అందుబాటులో ఉంటాయి. మొదటిదైన ప్రీ హాస్పిటల్‌లో భాగంగా ప్రమాదాల్లో గాయపడిన వారిని 108లో ఆస్పత్రికి తీసుకువచ్చేలోగానే అవసరమైన పరీక్షలు, వైద్య సాయం అందిస్తారు. ఇందుకోసం ప్రస్తుతం ఉన్న 108 అంబులెన్సులను అప్‌గ్రేడ్ చేయడంతోపాటు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌కు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. సదరు టెక్నీషియన్ ప్రమాదంలో గాయపడిన వ్యక్తి వివరాలను 108లో ఉన్న పరికరాల ద్వారా ఆన్‌లైన్‌లో వైద్యులకు చేరవేస్తారు. తద్వారా అంబులెన్స్ ఆస్పత్రికి వచ్చేలోగా సదరు గాయపడిన వ్యక్తికి అవసరమైన వైద్య పరీక్షలు దానికి అవసరమైన పరికరాలతో డాక్టర్లు, నర్సులు ఇతర సిబ్బంది అంతా సిద్ధంగా ఉంటాయి.

ఎమర్జెన్సీ విభాగంలో..

అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వీలుగా టెరి పరిధిలోకి రాబోతున్న ఆస్పత్రుల్లో ప్రస్తుతం ఉన్న క్యాజువాలిటీలో ప్రత్యేకంగా 10 పడకలతో ఎమర్జెన్సీ విభాగాన్ని ఏర్పాటు చేస్తారు. ఇక్కడ ఆటోక్లేవ్ మిషన్, మొబైల్ ఎక్స్‌రే, సక్షన్ ఆపరేటర్స్, డిఫిబ్రిలేటర్స్, సీ ఆర్క్, అల్ట్రాసోనోగ్రఫీ, అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్, వెంటిలేటర్లు, ఆపరేషన్ థియేటర్ ఎక్విప్‌మెంట్‌లు సమకూర్చుతారు. గుండె, అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, మాతాశిశు తదితర విభాగాల్లో అత్యవసర సేవలు అందించేందుకు వీలుగా పారామెడికల్, నర్సింగ్, స్పెషలిస్టు వైద్యులను కేటాయిస్తారు.

ముందుగా కొత్తగూడెంలో..

టెరి కార్యక్రమం ద్వారా ఆధునిక సేవలు ముందుగా రాష్ట్రంలోని 55 ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందివ్వాలని నిర్ణయించారు. ఇందులో జిల్లా ఆస్పత్రులు 21, మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న ఆస్పత్రులు 17, ఏరియా ఆస్పత్రులు 16లో అందుబాటులోకి తేనున్నారు. నిన్నామొన్నటి వరకు జిల్లా ఆస్పత్రిగా కొత్తగూడెం ఏరియా వైద్యశాల ఉండేది. గతేడాది బోధన ఆసుపత్రిగా మారింది. దీంతో మొదటి దశలోనే టెరి సేవలు కొత్తగూడెంలో అందుబాటులోకి రానున్నాయి.

భద్రాచలానికి కూడా అవకాశమిస్తే మేలు..

టెరి సేవలను మొదటి దశలో 16 ఏరియా ఆస్పత్రుల్లో అమలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. జిల్లాలో భద్రాచలం, మణుగూరు, బూర్గంపాడు, పాల్వంచ, ఇల్లెందు, అశ్వారావుపేటలలో వైద్య విధాన పరిషత్‌లో ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో భాగంగా ఉన్నప్పుడు ఖమ్మం తర్వాత అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రిగా భద్రాచలానికి గుర్తింపు ఉండేది. ఇక్కడికి జిల్లా వాసులే కాకుండా ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన రోగులు వస్తుంటారు. పైగా విజయవాడ–జగదల్‌పూర్ జాతీయ రహదారిపై భద్రాచలం ఉంది. దీంతో జిల్లాలో ఉన్న ఏరియా ఆస్పత్రుల్లో భద్రాచలానికి తొలి దశలోనే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా జిల్లాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎట్టకేలకు ‘మంద’హాసం..

- రెండో విడత గొర్రెల పంపిణీకి కార్యాచరణ..
- పారదర్శకత కోసం ప్రతీ మండలానికి ఒక కమిటీ
- మండలాలవారీగా లబ్ధిదారులతో అధికారుల సమావేశాలు
- వేసవి తర్వాత పంపిణీకి రంగం సిద్ధం



చండ్రుగొండ మండలంలో లబ్ధిదారులతో సమావేశం(ఫైల్)

సూపర్‌బజార్(కొత్తగూడెం): రెండో విడత గొర్రెల పంపిణీపై ప్రభుత్వం ఎట్టకేలకు నిర్ణయం తీసుకుంది. దీంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. మొదటి విడత గొర్రెల పంపిణీ పథకం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అమలు చేశారు. ఈసారి పారదర్శకంగా అమలు చేసేందుకు పకడ్బందీగా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. మండలానికో కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో తహసీల్దార్, ఎంపీడీఓ, పశుసంవర్థక శాఖ నుంచి ఒకరితోపాటు మరికొందరు బాధ్యులను నియమించారు. జిల్లాలోని 23 మండలాలకు సంబంధించి పథకం సజావుగా అమలు జరిగేలా మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించారు.

జాబితా తిరిగి పరిశీలన

పథకం అమలు కాక నాలుగేళ్లు అవుతుండటంతో లబ్ధిదారుల జాబితాను తిరిగి పరిశీలిస్తున్నారు. ఎవరైనా మరణిస్తే వారి నామినీ అర్హతను పరిశీలించి కేటాయిస్తామని అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి, లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. పెరిగిన యూనిట్ ధర, చెల్లించాల్సిన లబ్ధిదారుడి వాటా తదితర విషయాలు వివరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి అర్హులకు గొర్రెలు పంపిణీ చేయాలని కలెక్టర్ అనుదీప్ ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. అధికారులు జాబితాను వెరిఫికేషన్ చేస్తుండగా, ఈ ప్రక్రియ పూర్తయ్యాక జిల్లాస్థాయి ప్రత్యేక అధికారి తుది జాబితాను కలెక్టర్‌కు అందజేయనున్నారు.


పథకంలో మార్పులకు డిమాండ్..

పథకం అమలులో మార్పులు చేయాలని సమావేశాల్లో డిమాండ్ వస్తోంది. గొర్రెలు ఇవ్వకుండా, బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ చేస్తే తమకు నచ్చిన గొర్రెలను కొనుగోలు చేస్తామని లబ్ధిదారులు, గొర్రెల, మేకల కాపరుల సంఘం నాయకులు పేర్కొన్నారు. కానీ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నగదు బదిలీ అవకాశం లేదని అధికారులు తేల్చి చెబుతున్నారు.

వేసవి తర్వాతే..

ఎండలు మండుతున్న నేపథ్యంలో జీవాలకు ఇబ్బంది కలిగే అవకాశం ఉండడంతో వేసవి తరువాతే పథకం అమలుకు సన్నాహాలు చేస్తున్నారు. జూన్ మాసంలో పథకాన్ని అమలు చేసే అవకాశం ఉంది. ఈలోపు లబ్ధిదారులు తమ వాటాగా డీడీలు చెల్లించడం వంటి కార్యక్రమాలు పూర్తయ్యే అవకాశం ఉంది.

రెండో విడతలో 3,533 మందికి..



మొదటి విడతలో 7,511 మందికి లబ్ధి చేకూరగా రెండో విడత గొర్రెల పంపిణీ పథకంలో జిల్లాలో 3,533 మందికి లబ్ధి చేకూరనుంది. వీరిలో ఇప్పటికే 1,411 మంది వాటా నగదు చెల్లించారు. గతంలో యూనిట్ కాస్ట్ రూ.1,25,000 ఉండగా లబ్ధిదారుడి వాటా 25 శాతం రూ.31,250 డీడీ రూపంలో చెల్లించారు. ప్రస్తుతం యూనిట్ ధర రూ.1,75,000కు చేరగా, లబ్ధిదారుడు వాటాగా రూ.43,750 చెల్లించాల్సి వస్తుంది.

పారదర్శకంగా అమలు



కలెక్టర్ ఆదేశాలతో పారదర్శకంగా పథకం అమలుకు కార్యాచరణను ప్రారంభించాం. సమావేశాలను ప్రతి మండలంలో నిర్వహించి పథకం అమలుపై అవగాహన కల్పించాం. జూన్ మాసంలో గొర్రెలు పంపిణీ చేసే అవకాశం ఉంది.

– బి.పురంధర్, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి

అభివృద్ధి పనుల తనిఖీ



పనుల నివేదికలను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం కలెక్టర్ అనుదీప్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న నూతన గ్రంథాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. తక్షణమే కాంపౌండ్ వాల్ నిర్మాణంతో పాటు లైబ్రరీలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే విధంగా గ్రీనరీ పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రగతి మైదానంలో సింథటిక్ కోర్టు, టెన్నిస్ కోర్టు నిర్మాణ పనులను తక్షణమే చేపట్టాలని చెప్పారు. అనంతరం దివ్యాంగుల కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలించి కాంపౌండ్ వాల్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టైల్స్ తదితర సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. రామవరంలోని సాధన మైదానాన్ని సందర్శించిన ఆయన రెండు బ్యాడ్మింటన్ కోర్టులు ఏర్పాటు పనులను తక్షణమే చేపట్టి పూర్తి చేయాలని చెప్పారు. పనుల్లో జాప్యం కావొద్దని, నాణ్యత పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలల్లో మున్సిపల్ కమిషనర్ రఘు, డిఈ నవీన్, ఏఈ రాము, కౌన్సిలర్ మోరె రూప తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి

చుంచుపల్లి: మహిళల ఆరోగ్యంతోనే ఇంటింటా సౌభాగ్యం కలుగుతుందని, అందరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. మంగళవారం చుంచుపల్లి మండలం పెనగడప పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్య విషయాల్లో నిర్లక్ష్యం చేయొద్దని చెప్పారు. మహిళా ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో 31 పీహెచ్‌సీలు ఉండగా, 5 పీహెచ్‌సీల పరిధిలో ప్రతి మంగళవారం డయాగ్నస్టిక్స్, కేన్సర్ స్క్రీనింగ్ , సూక్ష్మ పోషక లోపాలు, మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, కుటుంబ నియంత్రణ సమస్యల నిర్వహణ, మెనోపాజ్ నిర్వహణ, లైంగిక వ్యాధుల నిర్వహణ, శరీర బరువు నిర్వహణ.. ఎనిమిది రకాల వైద్య పరీక్షలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో వ్యాధి నిర్ధారణ తదుపరి వైద్య సేవల కోసం హైదరాబాద్ సిఫారసు చేస్తామని అన్నారు. పీహెచ్‌సీలు అందిస్తున్న వైద్య సేవల పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేసి సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శిరీష, జిల్లా సంక్షేమ అధికారి లెనినా, వైద్యాధికారులు సుకృత, మణికంఠ రెడ్డి, అంబ్రీన్ నేహా, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, సర్పంచ్ మాలోత్ కళావతి, ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ గుంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

పాల్వంచ: నూతన గ్రంథాలయ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయం పక్కన ఐటీసీ సీఎస్ఆర్ నిధులు రూ.కోటితో నిర్మిస్తున్న గ్రంథాలయం నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. మే 20వ తేదీలోగా పునులు పూర్తి చేయాలని, వాల్ పెయింటింగ్స్, పచ్చదనం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్, తహసీల్దార్ రంగా ప్రసాద్, ఏఈ రాజేశ్ పాల్గొన్నారు.

ఆర్టిజన్ల సమ్మె విచ్ఛిన్నం

- అధికారుల హెచ్చరికలతో విధులకు హాజరైన కార్మికులు
- కేటీపీఎస్ కాంప్లెక్స్ వద్ద పోలీసుల భారీ బందోబస్తు



కేటీపీఎస్ అంబేడ్కర్ సెంటర్‌లో భారీగా మోహరించిన పోలీసు బలగాలు

పాల్వంచ: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్లు చేపట్టిన సమ్మె విచ్ఛిన్నమైంది. జెన్‌కో అధికారులు రంగంలోకి దిగి కార్మికులతో వేర్వేరుగా మాట్లాడటంతో మంగళవారం విధులకు హాజరయ్యారు. కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు ఆందోళనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులు తమ డిమాండ్లు పరిష్కరించాలని ఫిట్‌మెంట్ 51శాతం ఇవ్వాలని, రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా తమను తీసుకోవాలని, ఏపీఎస్ఈబీ నిబంధనలు వర్తింప జేసి, స్టాండింగ్ ఆర్డర్లు రద్దు చేయాలని కోరుతూ తెలంగాణా విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్(హెచ్ 82) కొద్దిరోజులుగా ఆందోళనలు చేపడుతోంది. ప్రభుత్వం, జెన్‌కో యాజమాన్యం తీరును నిరసిస్తూ ఈ నెల 25వ తేదీ నుంచి సమ్మెకు పిలుపునిచ్చింది. కాగా విధులకు గైర్హాజరై సమ్మె చేస్తే విధుల నుంచి తొలగిస్తామని విద్యుత్ సంస్థల యాజమాన్యాలు సోమవారం ఉత్తర్వులు జారీ చేశాయి.

సమీక్షించిన జెన్‌కో డైరెక్టర్, సీఈలు

కార్మికులు విధులకు హాజరయ్యేలా జెన్‌కో డైరెక్టర్ (థర్మల్) బి.లక్ష్మయ్య, సీఈలు పి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్ రావు, ఎస్‌పీఎఫ్ అడిషనల్ కమాండెంట్ సీ.జంగయ్య, అసిస్టెంట్ కమాండెంట్ అప్పాజీ, డీఎస్పీ వెంకటేష్, సీఐ నాగరాజు, ఎస్‌ఐలు నరేశ్, శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో భారీ ఎత్తున పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అల్లూరి సెంటర్ నుంచి 5,6 దశల కార్మాగారం వరకు భారీ ఎత్తున పోలీసులను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా విధులకు వచ్చే వారికి భద్రత కల్పించారు. సమస్యలు ఉంటే యాజమాన్యంతో చర్చించి పరిష్కరించుకోవాలని, ఆందోళనలు చేయడం సరికాదని వచ్చని ఈ సందర్భంగా డైరెక్టర్ లక్ష్మయ్య పేర్కొన్నారు.

తొలగింపు ఆర్డర్లు సిద్ధంగా ఉన్నాయంటూ ఇంజనీర్ల ఫోన్లు!

కేటీపీఎస్ సీఈలు పి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్ రావు, జెన్‌కో విజిలెన్స్ ఓఎస్డీ వినోద్ కుమార్ సోమవారం చర్చలు జరిపినా కార్మికులు శాంతించలేదు. సమ్మెకే మొగ్గు చూపారు. కాగా ఎస్ఈలు, ఈఈలు, డీఈలు, ఏఈలు తమ పరిధిలో పనిచేసే ఆర్టిజన్ కార్మికులతో ప్రత్యేకంగా మాట్లాడారు. విధులు బహిష్కరిస్తే కార్మికులే నష్టపోతారని, విధులకు రాని వాళ్లను తొలగించేందుకు ఆర్డర్లు సిద్ధంగా ఉన్నాయని, పేర్లు, ఐడీ నంబర్లు వేసి ఆర్డర్లు విడుదల చేస్తామని, ఉన్నతాధికారుల నుంచి మాకు ఆదేశాలు ఉన్నాయంటూ ఇంజనీర్లు చెప్పారని, అనేక మార్లు ఫోన్ చేశారని పలువురు కార్మికులు వాపోయారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో ఉన్న తాము విధులకు రాక తప్పలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రాత్రివేళ నాయకుల అరెస్ట్

సీఈలు పది మంది నేతలపై ఫిర్యాదు చేయగా, పోలీసులు సోమవారం రాత్రి వారి ఇళ్లకు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. రాత్రి షిఫ్ట్ డ్యూటీలో ఉన్న వారిని సైతం అరెస్ట్ చేసేందుకు వెళ్లగా, విధుల్లో ఉన్నవారిని ఎలా అరెస్ట్ చేస్తారంటూ ప్రశ్నించడంతో పోలీసులు వెనుదిరిగారని కార్మిక నాయకులు చెబుతున్నారు. విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ జెన్‌కో అధ్యక్ష కార్యదర్శులు ఉండేటి జయరాజు, ఆవుల కృష్ణారావు పోలీసులకు దొరకలేదు. కాగా ఓ నాయకుడు ఇంటి వద్ద లేకపోవడంతో అతని కొడుకును పోలీసులు పట్టుకెళ్లారని కార్మికులు ఆరోపించారు. రామకృష్ణ, హనుమంతరావు, రాంబాబు తోపాటు మరికొందరు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బీఆర్ఎస్ ప్రతినిధుల సభలు సక్సెస్



కొత్తగూడెం సభలో మాట్లాడుతున్న ఖమ్మం ఎంపీ నామా, పక్కన ఎమ్మెల్యే వనమా

నియోజకవర్గకేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ ప్రతినిధుల సభలు ఉత్సాహంగా సాగాయి. ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు, నాయకులు హాజరై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. తొలుత పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. –సాక్షి నెట్‌వర్క్

వివరాలు 9లో

ధాన్యం నీళ్లపాలు



అశ్వాపురం మండలం చింతిర్యాల కాలనీలో తడిసిన ధాన్యపు రాశి

అశ్వాపురం: అకాల వర్షాలకి కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోతోంది. దీంతో అన్నదాతలు మనోవేదనకు గురవుతున్నారు. శని, ఆదివారాల్లో జిల్లాలో పలుచోట్ల వర్షం కురవడంతో ధాన్యం తడవడంతోపాటు మొక్కజొన్న, మిర్చి, వరి పంటలు దెబ్బతిన్నాయి. మంగళవారం కూడా పలుచోట్ల వర్షం కురిసింది. అశ్వాపురం, దుమ్ముగూడెం తదితర మండలాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. భారీ వర్షం కురిసింది. దీంతో కల్లాల్లో పోసిన ధాన్యం, మిర్చి రాశులు తడిసిపోయాయి. స్తంభాలు నేలకొరిగి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. రహదారులపై చెట్లు కూలి రాకపోకలకు అంతరాయం కలిగింది. వాగులు కూడా ఉప్పొంగాయి.

క్లుప్తంగా

స్వచ్ఛ భారత్ లక్ష్యాలను పూర్తిచేయాలి

● కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): స్వచ్ఛ భారత్ మిషన్ రెండో దశలో కేటాయించిన లక్ష్యాలను రానున్న వందరోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ నుంచి స్వచ్ఛ భారత్ మిషన్‌పై ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో 2,317 మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉందని, వాటిలో ఇప్పటివరకు 729 నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 1,588 నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని ఆదేశించారు. మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తయిన గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్‌గా ప్రకటించాలని అన్నారు. నిర్దేశించిన 104 గ్రామ పంచాయతీల్లో గ్రామసభల తీర్మానాలు చేయాలని ఆదేశించారు. డీఆర్‌డీఓ అదనపు ఏపీడీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలన ఆదర్శం



పతాకావిష్కరణ చేస్తున్న విప్ రేగా కాంతారావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ముఖ్యమంత్రిగా కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం గులాబీ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధులు షేక్ అన్వర్, లకావత్ గిరిబాబు, జేవీఎస్ చౌదరితోపాటు కర్నే మురళి, మోరె భాస్కర్, సంకుబాపన అనుదీప్, మోరే రమేశ్, సయ్యద్ యూసుఫ్, పోతురాజు రవి, ఎండీ ఆదాం, యాంపాటి సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు



తనిఖీ చేస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: డీఎంహెచ్‌ఓ జేవీఎల్ శిరీష ఆదేశాల మేరకు జిల్లాలోని భద్రాచలంలో పలు స్కానింగ్ సెంటర్లను మంగళవారం వైద్యారోగ్య శాఖ అధికారులు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రాజ్‌కుమార్, డిప్యూటీ డెమో ఎండీ ఫయాజ్ మొయినుద్దీన్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మలేరియా కేసుల తగ్గుముఖం

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష

చుంచుపల్లి: జిల్లాలో వైద్య సిబ్బంది కృషితో మలేరియా కేసులు తగ్గుముఖం పట్టాయని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జేవీఎల్ శిరీష అన్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీని కొత్తగూడెం ఓల్డ్ డిపో వద్ద ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ సూపర్ బజార్ మీదుగా బస్టాండ్ సెంటర్ వరకు కొనసాగింది. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అధికారులు, సిబ్బంది మలేరియాపై ఆరోగ్య కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టారని పేర్కొన్నారు. 2021తో పోల్చితే ఇప్పుడు చాలా వరకు మలేరియా కేసులు తగ్గాయని తెలిపారు. వైద్యాధికారులు సుకృత, బాలాజీ, మణికంఠరెడ్డి, ఫయాజ్ మొహిద్దిన్, గొంది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యుత్ ఆర్టిజన్ల బైండోవర్

దమ్మపేట: వేతనాలు పెంచి, ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని కోరుతూ సమ్మెకు దిగిన విద్యుత్ ఆర్టిజన్ కార్మికులను మంగళవారం పోలీసులు బైండోవర్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గట్టుగూడెం, నాయుడుపేట విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఆర్టిజన్లుగా విధులు నిర్వర్తిస్తున్న సత్తెనపల్లి శ్రీను, కోపూరి శ్రీను సమ్మెకు దిగారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని, మండల ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట బైండోవర్ చేశారు. వారిపై కేసు కూడా నమోదు చేశామని అదనపు ఎస్‌ఐ సీమ తెలిపారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,943

‘హద్దు’ పద్దు లేదు..

యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమ రవాణా

● దొడ్డిదారిన ఛత్తీస్‌గఢ్‌కు తరలిస్తున్న దళారులు
● ప్రతీ రోజు క్వింటాళ్ల కొద్ది సరఫరా



ఇటీవల పౌరసరఫరాలశాఖ ఉద్యోగులు స్వాధీనం చేసుకున్న బియ్యం (ఫైల్)

భద్రాచలంటౌన్: పేదలకు అందాల్సిన సబ్సిడీ బియ్యం అక్రమ రవాణా జరగకుండా అడ్డుకట్ట వేసేందుకు అధికార యంత్రాంగం ఎంత ప్రయత్నించినా దళారులు రోజుకో ఎత్తుగడ వేస్తున్నారు. ఒకే సారి బియ్యాన్ని తరలించకుండా దశలవారీగా రోజూ కొన్ని క్వింటాళ్ల చొప్పున అధికారులకు సైతం అనుమానం రాకుండా ఆటోల్లో సరిహద్దులు దాటిస్తున్నారు. భద్రాచలం కేంద్రగా ఈ రేషన్ బియ్యం అక్రమ దందా జోరుగా సాగుతోంది. దీంతో ప్రజలకు చేరాల్సిన బియ్యం దొడ్డిదారిన దర్జాగా సరిహద్దులు దాటిపోతోంది. పౌర సరఫరాల శాఖ నిఘా, నియంత్రణ కొరవడడంతో కొన్నిచోట్ల నేరుగా రేషన్ దుకాణాల నుంచే రేషన్ బియ్యం దళారుల పాలవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ దందాతో అయా వర్గాలు లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారు. సంబంధిత అధికారులు సైతం నామమాత్రపు తనిఖీలు చేపట్టి చిన్న చిన్న కేసులు నమోదు చేసి పెద్దలను వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భద్రాచలం డివిజన్ ప్రాంతం మొత్తం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి సరిహద్దుగా ఉండడంతో నిత్యం వివిధ రకాల రవాణా మార్గాల ద్వారా వేల క్వింటాళ్ల రేషన్ బియ్యం దళారులు హద్దులు దాటిస్తున్నారు. దుమ్ముగూడెం, చర్ల మండలాల నుంచి యథేచ్ఛగా రేషన్ బియ్యం రవాణా సాగుతోంది. గతంలో దళారులు లారీలలో రేషన్ బియ్యంను ఛత్తీస్‌గఢ్‌తో పాటు ఒడిశా రాష్ట్రాలకు తరలించేవారు. ఈ లారీలను అధికారులు పట్టుకుంటే భారీ మొత్తంలో నష్ట పోతుండడంతో రూటు మార్చిన దళారులు చిన్నచిన్న ఆటోలలో 5 నుంచి 20 క్వింటాళ్ల వరకు గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు ఏడాది కాలంలో జిల్లాలో పలు ప్రాంతాల్లో రేషన్ బియ్యం తరలిస్తున్న వారిని పట్టుకున్ని కేసులు నమోదు చేశారు. అలా 199 వరకు కేసులు నమోదు చేసి వాహనాలతో పాటు సుమారు 2 వేల క్వింటాళ్ల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్నారు.

సాగుతోందిలా..

జిల్లాలో మొత్తం 442 రేషన్ షాపులు, 2,93,683 రేషన్ కార్డులున్నాయి. ఈ కార్డులపై ప్రతి నెల రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సుమారు 40 వేల క్వింటాళ్ల బియ్యాన్ని సరఫరా చేస్తున్నాయి. ఈ క్రమంలో ఒక్కో వ్యక్తి పేరిట 6 కిలోల బియ్యం పంపిణీ చేస్తున్నారు. కార్డులు ఉన్న వారిలో 40 శాతానికి పైగా సన్న బియ్యం తింటున్నారు. మిగతా వారు దొడ్డు బియ్యాన్ని తింటున్నారు. ఈ 40 శాతం బియ్యంలో సగం వరకు రేషన్ బియ్యాన్ని డీలర్లే కొనుగోలు చేస్తున్నారు. వినియోగదారుడి నుంచి కిలోకి రూ.8 నుంచి రూ.10 చొప్పున చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఆ బియ్యాన్ని అదే రోజు రాత్రి గానీ మరుసటి రోజు రాత్రి గానీ డీలర్లు షాపుల నుంచి రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. మిగతా సగం బియ్యాన్ని దళారులు ఊరూరా తిరుగుతూ కొనుగోలు చేస్తున్నారు. దళారులు రేషన్ డీలర్ల వద్ద బియ్యానికి కిలోకు రూ.15 నుంచి రూ.16 చొప్పున కొనుగోలు చేసి సరిహద్దులోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కుంట, సుకుమా ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. ఒక్కో క్వింటా రూ.2,300 నుంచి రూ.2,500 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

నామమాత్రపు తనిఖీలు

పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని డీలర్లు పక్కదారి పట్టించకుండా ఉండేందుకు ప్రభుత్వం బయోమెట్రిక్ యంత్రాలను తీసుకొచ్చినప్పటికీ దళారుల దందా మాత్రం ఆగడం లేదు. వేలిముద్రలు వేసి బియ్యం తీసుకోవాల్సిన వినియోగదారులు అక్కడనే విక్రయిస్తున్నారు. ప్రతి నెల ఒక షాపునకు ఎంత కోటా వచ్చింది? వినియోగదారులు తీసుకున్న బియ్యం ఎంత? మిగిలిన కోటా ఎంత? అనే లెక్కలు అధికారులకు సులభంగా తెలిసిపోతుంది. కానీ, పౌరసరఫరాల శాఖాధికారులు మాత్రం ఆ దిశగా షాపులను ఏమాత్రం తనిఖీలు చేయడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తే వాస్తవాలు బయటకు వచ్చే అవకాశాలున్నప్పటికీ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. రైస్‌మిల్లులను కూడా నామమాత్రంగానే తనిఖీ చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన అనుమతుల ప్రకారం ఆయా రైస్ మిల్లులకు ఇచ్చిన ధాన్యం ఎంత? అది మరపట్టించగా వచ్చే బియ్యం ఎన్ని? అనే కోణంలో వివరాలతో తనిఖీలు చేస్తే అక్రమాలు బయట పడతాయి. అధికార యంత్రాంగం పెద్దఎత్తున తనిఖీలు చేపట్టని కారణంగానే రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ అక్రమ దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ బియ్యం రవాణా చేస్తే కఠిన చర్యలు



ప్రభుత్వం సబ్సిడీతో పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యంను అక్రమంగా తరలించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ ఎడాది ఇప్పటి వరకు 199 కేసులు నమోదు చేశాం. పట్టుబడిన వాహనాలను స్వాధీనం చేసుకున్నాం. రేషన్ బియ్యం స్మగ్లింగ్ నియంత్రణ కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, పౌర సరఫరాల శాఖకు సంబంధించిన అధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. పోలీసులు కూడా బియ్యం అక్రమ రవాణాపై దృష్టి సారించి తనిఖీలు చేస్తున్నారు. గతంతో పోలిస్తే చాలావరకు నియంత్రణలోకి వచ్చింది.

–మల్లికార్జున్‌బాబు, జిల్లా పౌరసరఫరాల అధికారి

నీడనిచ్చి ఆదుకోండి..



సమావేశంలో పాల్గొన్న ఓసీ ప్రభావిత ప్రాంత ప్రజలు

● ఒకనాడు సంస్థకు అండగా ఉన్నాం..
● జేకే ఓసీ నిర్వాసితుల మనోగతం

ఇల్లెందురూరల్: సింగరేణి సంస్థ కష్టాల్లో ఉన్నప్పుడు అండగా ఉండి శ్రమించి సంస్థను నిలబెట్టిన కుటుంబాలు తమవని, నేడు అదే సంస్థ నిలువ నీడ చూపి ఆదుకోవాలని మాత్రమే కోరుతున్నామని 21 పిట్ ఏరియా ప్రజలు వేడుకుంటున్నారు. సింగరేణి యాజమాన్యం 21 పిట్ ఏరియాను ఆనుకొని నూతనంగా జేకేఓసీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్న విషయం తెలిసిందే. దీని కోసం ప్రజాభిప్రాయ సేకరణ కోసం బుధవారం సంస్థ నిర్వహిస్తున్న సమావేశానికి ముందు 21 పిట్ ఏరియా పరిధిలోని వివిధ రాజకీయ పక్షాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సింగరేణి సంస్థ చేపట్టిన జేకేఓసీ పనులకు తాము వ్యతిరేకం కాదని, కానీ, తమ కోరికలు తీర్చాలన్న ప్రతిపాదనను యాజమాన్యం ముందు బలంగా వినిపించాలని నిర్ణయించారు. సంస్థ ఏర్పాటు చేసిన తొలి కార్మికవాడలో ప్రస్తుతం అప్పటి కార్మికుల కుటుంబాలే నివసిస్తున్నాయని, ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన క్వార్టర్లను కార్మికుల కుటుంబాలకే అప్పగించాలని, క్వార్టర్ల మరమ్మతు కోసం ప్రభుత్వం ప్రకటించిన రూ.3 లక్షల ఇళ్ల పథకాన్ని ఈ ప్రాంత ప్రజలకు వర్తింపజేయాలని కోరారు. 21 ఏరియా పరిధిలోని విజయలక్ష్మీనగర్, తిలక్‌నగర్ గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా పూర్తిగా యాజమాన్యమే చూసుకోవాలని, ప్రతి ఇంటికి ప్రభుత్వ విద్యుత్ సరఫరా చేయాలని, అందుకయ్యే ఖర్చును సింగరేణి యాజమాన్యమే భరించాలని, పూర్తిగా నిర్వాసితులయ్యే కుటుంబాలకు మెరుగైన ప్యాకేజీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సర్పంచ్‌లు పూనెం కవిత, ధనసరి స్రవంతి, ఎంపీటీసీ పూనెం సురేందర్, ఉపసర్పంచ్ తాండ్ర నాగరాజు, 21 ఏరియా పరిరక్షణ కమిటీ ప్రతినిధులు, వివిధ రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకేఓసీ విస్తరణ కోసం బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించనున్నారు. మంగళవారం పట్టణంలోని 24 ఏరియా సింగరేణి గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన–2006 ప్రకారం కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నుంచి పర్యావరణ అనుమతి కోసం ఈ సభ నిర్వహిస్తున్నారు. 21 ఇంక్లయిన్ భూగర్భ గనిని ఓసీగా మార్చేందుకు, జేకే–5 ఓసీ విలీనంపై ప్రజాభిప్రాయాన్ని తీసుకోనున్నారు. రూ.297.66 కోట్లతో 2.50 మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీసేలా 1,114.507 హెక్టార్ల విస్తీర్ణంలో రొంపేడు, సుదిమళ్ల, ఉసిరికాయలపల్లి గ్రామాల పరిధిలో ఓసీ ఏర్పాటు చేయనున్నారు. మరో 15 ఏళ్లపాటు ఉత్పత్తి సాగే ఈ ఓసీ మీద ఇల్లెందు మనుగడ ఆధారపడి ఉంది. ఇల్లెందు ఏరియా జీఎం ఎం.షాలేమురాజు, అధికారులు మల్లారపు మల్లయ్య, జీవీ మోహన్‌రావు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఉదయం 11 గంటలకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది.

జనజీవన స్రవంతిలోకి మావోయిస్టులు..

● ఆపరేషన్ చేయూతతో సత్ఫలితాలు..
● మావోయిస్టు మహేశ్ లొంగుబాటు సందర్భంగా ఎస్పీ డాక్టర్ వినీత్



మాట్లాడుతున్న ఎస్పీ డాక్టర్ వినీత్

కొత్తగూడెంటౌన్: ఆపరేషన్ చేయూత కార్యక్రమం ద్వారా జనజీవన స్రవంతిలోకి వచ్చేందుకు మావోయిస్టులు ముందుకు వస్తున్నారని, అందులో భాగంగానే మావోయిస్టు పార్టీ సభ్యుడు సంగెపు మహేశ్ పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయారని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, 89 బెటాలియన్ సీఆర్‌పీఎఫ్, 141 బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ అధికారుల ఎదుట సీపీఐ మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం – తూర్పు గోదావరి డివిజన్ మణుగూరు ఎల్‌ఓఎస్ (మణుగూరు – పాల్వంచ ఏరియా కమిటీ) సభ్యుడు సంగెపు మహేశ్ మంగళవారం లొంగిపోయారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంగెపు మహేశ్ అలియాస్ సుధీర్ లొంగిపోయిన వివరాలను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ వెల్లడించారు. మహేశ్ 2012 నుంచి 2022 వరకు మిలీషియా సభ్యుడి నుంచి భద్రాద్రి కొత్తగూడెం – తూర్పు గోదావరి డివిజన్ మణుగూరు ఎల్‌ఓఎస్ సభ్యుడిగా పనిచేశారని తెలిపారు. మావోయిస్టు అగ్రనాయకుల వేధింపులు తాళలేకనే మావోయిస్టులు లొంగిపోతున్నారని, దళ నాయకులు, దళ సభ్యులు కొంతకాలంగా పార్టీ సిద్ధాంతాలు నచ్చక సాధారణ జీవితం గడపడానికి ఆసక్తి చూపుతున్నారని, వరుస లొంగుబాట్లు, అరెస్టులతో తెలంగాణ మావోయిస్టు పార్టీ దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయిందని పేర్కొన్నారు. లొంగిపోవాలనుకునే మావోయిస్టులు వారి కుటుంబ సభ్యుల ద్వారా గానీ, స్వయంగా కానీ దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌లో లేదా జిల్లా ఉన్నతాధికారులను సంప్రదించి లొంగిపోవాలని, వారికి జీవనోపాధి, పునరావాసం కల్పిస్తామని, ప్రభుత్వం తరఫున అందాల్సిన అన్నిరకాల ప్రతిఫలాలను అందించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందని ఎస్పీ స్పష్టం చేశారు. అనంతరం లొంగిపోయిన సంగెపు మహేశ్‌కు రివార్డు అందజేశారు. సమావేశంలో ఓఎస్డీ సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, 141 బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ కమల్‌వీర్‌యాదవ్, 81 బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ సునీల్‌కుమార్, చర్ల సీఐ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసెల తొలగింపులో ఉద్రిక్తత

అటవీ అధికారుల తీరుపై నిరసన



కృష్ణసాగర్ వద్ద ఫారెస్ట్ అధికారులు తొలగించిన గుడిసెలు

బూర్గంపాడు: కృష్ణసాగర్‌కు సమీపంలోని ప్రభుత్వ భూములలో వేసిన గుడిసెలను మంగళవారం ఫారెస్ట్ అధికారులు తొలగించారు. గుడిసెలు తొలగిస్తున్న క్రమంలో అటవీశాఖ అధికారులకు, గుడిసెవాసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. సారపాకకు చెందిన సుమారు 500 మంది పేదలు గోదావరి వరదల తరువాత కృష్ణసాగర్‌కు సమీపంలోని ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. సుమారు 9 నెలలకు పైబడి వారు అక్కడే నివాసముంటున్నారు. ఒకట్రెండు సార్లు ఫారెస్ట్ అధికారులు తమ భూములలో గుడిసెలు వేసుకున్నారని వాటిని తొలగించేందుకు యత్నించారు. గుడిసెవాసులకు వామపక్షాల నాయకులు అండగా నిలిచారు. మంగళవారం ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది పెద్దసంఖ్యలో అక్కడకు చేరుకుని గుడిసెలు తొలగించే చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గుడిసెలలోని నిత్యావసరాలను, దుస్తులను బయటకు విసిరేశారని గుడిసెవాసులు ఆరోపిస్తున్నారు. ఉదయాన్నే అందరూ కూలిపనులకు వెళ్లిన తరువాత ఫారెస్ట్ అధికారులు పక్కా పథకం ప్రకారం గుడిసెలు తొలగించారని బాధితులు మండిపడుతున్నారు. ఓ ఫారెస్ట్ అధికారి తన హోదాను మరిచి తమపై వీరంగమాడాడని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి వరద ముంపు బాధితులకు మెరక ప్రాంతాలలో ఇళ్లు ఇస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని ఎందుకు విస్మరించారని వారు నిలదీశారు. ప్రభుత్వ భూమిలో గుడిసెలు తొలగించే హక్కు ఫారెస్ట్ అధికారులకు ఎక్కడిదని ప్రశ్నించారు. ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అండతోనే ఫారెస్ట్ అధికారులు ఈ దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. భద్రాచలం ఐటీడీఏ పీఓ ఈ విషయంలో జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రశాంతంగా ‘ఓపెన్’ పరీక్షలు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణా ఓపెన్ స్కూల్ పబ్లిక్ టెస్ట్, ఇంటర్మీడియట్ పరీక్షలు తొలిరోజు మంగళవారం జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. కొత్తగూడెంలోని నాలుగు 4 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. ఉదయం పరీక్షకు 629 మంది హాజరుకావాల్సి ఉండగా 539 మంది హాజరయ్యారు. 90 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు ఐదు కేంద్రాల్లో 830 మంది విద్యార్థులు కావాల్సి ఉంది. 699 మంది హాజరు కాగా 131 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం ఇంటర్ పరీక్షకు ఆరుగురు విద్యార్థులకు గాను ఐదుగురు హాజరు కాగా, ఒక విద్యార్థి గైర్హజరయ్యాడు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయి. పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. విద్యార్థుల కోసం వైద్య సిబ్బంది ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులు పంపిణీ చేశారు. పరీక్షలు మే 4వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

‘గుప్త నిధుల’ ముఠా అరెస్ట్

రూ.4.5 లక్షల సొమ్ము రికవరీ



మాట్లాడుతున్న సీఐ రమాకాంత్, ఎస్‌ఐ ప్రవీణ్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి గ్రామంలో గుప్తనిధుల పేరిట టోకరా వేసిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేయటంతోపాటు రూ.4.5 లక్షల సొమ్మును రికవరీ చేశామని సీఐ రమాకాంత్ మంగళవారం వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని ఎదురుగడ్డ గ్రామ ఉప సర్పంచ్ వినోద్ మార్చి 17న తన బావ అనిశెట్టిపల్లి గ్రామానికి చెందిన జలారపు శేషగిరికి ఫోన్ చేసి తన మిత్రులు నలుగురు రెండు రోజులు ఉండటానికి రూం కావాలని అడిగాడు. తన ఇంట్లోనే ఒక ఖాళీ గది ఉందని శేషగిరి చెప్పారు. అదేరోజు రాత్రి ఎదురుగడ్డకు చెందిన పాషా, వెంకటేశ్వర్లు, నవీన్, రవి అనే నలుగురు వ్యక్తులు రూంలో ఉండి మరుసటి రోజు వినోద్‌తో కలిసి వారు బయటకు వెళ్లి వచ్చారు. ఈ ముఠా అదే రోజు మధ్యాహ్నం సమయంలో శేషగిరికి ఫోన్ చేసి రూంలో ఖరీదైన వస్తువు ఉంచామని, అది కనిపించటం లేదని చెప్పారు. ఇంట్లో ఏ వస్తువు ఉందో తనకు తెలియదని శేషగిరి.. వినోద్‌కు చెప్పగా.. వెంటనే ‘నీవు’ఎదురుగడ్డకు రావాలని వినోద్ చెప్పాడు. దీంతో శేషగిరి తన తమ్ముడు నిరంజన్‌తో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లారు. వారిని ఎదురుగడ్డలోని రైల్వే ట్రాక్ ప్రాంతంలోకి తీసుకువెళ్లి విచక్షణా రహితంగా దాడి చేసి రూ.కోట్ల విలువైన వస్తువును దాచిపెడితే మాయం చేశావని, రూ.10 లక్షలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ప్రాణభయంతో శేషగిరి ఒప్పుకొని రూ.4.5 లక్షలు ముఠా సభ్యులకు ఇచ్చాడు. అనంతరం బాధితుడు శేషగిరి ఇచ్చిన ఫిర్యాదుతో పాషా, వెలిశాల వినోద్, కాకటి వెంకటేశ్వర్లు, గుర్రం నవీన్, తలారి రవి, వెలిశాల కళ్యాణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ రమాకాంత్ వెల్లడించారు. వారి వద్ద నుంచి రూ.4.5 లక్షలు రికవరీ చేశామని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ప్రవీణ్ పాల్గొన్నారు.

కుమారుడి కళ్లు దానం చేసిన తల్లి



నేత్రనిధి సంస్థ బాధ్యులతో రాధ

సింగరేణి(కొత్తగూడెం): కుమారుడు గుండెపోటుతో మృతిచెందగా అతడి కళ్లను దానం చేసి ప్రశంసలందుకుంది అతడి తల్లి. మంగళవారం కొత్తగూడెం ఏరియా టూ ఇంక్లయిన్ పటేల్‌బస్తీలో ఈ ఘటన చోటుచేసుకుంది. సింగరేణి సంస్థలో ఉద్యోగం చేసే రామ్‌కేదారి మృతిచెందటంతో అతడి ఉద్యోగం ఆయన భార్య రాధకు ఇచ్చారు. వారికి నలుగురు కుమారులు. 2005లో చిన్నకుమారుడు రాకేశ్‌కుమార్ మృతి చెందాడు. 2019లో పెద్దబ్బాయి ప్రమాదంలో మృతిచెందాడు. 2022లో రెండో అబ్బాయి కేన్సర్‌తో మృతిచెందాడు. మూడో అబ్బాయి రవికుమార్ సోమవారం రాత్రి మృతిచెందాడు. అంతటి దుఃఖంలో కూడా ఆ తల్లి తన కుమారుడి కళ్లు దానం చేయాలని నిర్ణయించుకొని నేత్రనిధికి సమాచారం అందించి కళ్లు దానం చేశారు. ఈ సందర్భంగా రాధను పలువురు అభినందించారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: పురుగులమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక ఎస్‌ఐ బి.రాజేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని కావడిగుండ్ల గ్రామానికి చెందిన సరియం రమేశ్ (32) కొంతకాలంగా అతిగా మద్యం సేవిస్తున్నాడు. ఈ విషయంపై కుటుంబీకులు మందలించగా మనస్తాపానికి గురైన రమేశ్ సమీప పొలం వద్దకు వెళ్లి పురుగులమందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య చిన్నక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి నాలుగేళ్ల వయస్సు ఉన్న కుమారుడు ఉన్నాడు.

కేసు నమోదు

దమ్మపేట: ఫోన్ కాల్‌లో అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి ఆన్‌లైన్‌లో డబ్బులు పంపి మోసపోయిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. దమ్మపేట గ్రామానికి చెందిన నాగరాజు శ్రీనివాసరాజు (36) అక్టోబర్ 10, 2022న తన మొబైల్‌లో ఫేస్‌బుక్ చూస్తుండగా, వచ్చిన యాడ్‌ను చూసి బజాజ్ ఫైనాన్స్‌లో లోన్ కోసం ఒక మేసేజ్ పంపాడు. అప్పటి నుంచి అతడికి తెలియని ఫోన్ నంబర్ల ద్వారా ఫోన్ చేసిన వారి మాటలు నమ్మి లోన్ కోసం విడతలవారీగా రూ.94,970 పంపాడు. ఇదంతా మోసం అని గ్రహించిన అతడు ఎన్‌సీఆర్‌పీలో ఫిర్యాదు చేశాడు. మంగళవారం ఇదే ఘటనపై దమ్మపేట పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేయగా, అదనపు ఎస్‌ఐ సీమ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పిడుగుపాటుతో పాడిగేదె మృతి

బోనకల్: మండలంలోని రాపల్లిలో మంగళవారం పిడుగుపడి పాడి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన బోలెం రాము పొలంలో గేదెను మేపుతుండగా ఈదురు గాలులతో కూడిన వర్షానికి పిడుగు పడగా మృతి చెందింది. దీంతో సుమారు రూ.80 వేలు నష్టపోయినందున తనను ఆదుకోవాలని రైతు కోరాడు.

క్లుప్తంగా...

సీబీఐ విచారణకు సునీత, రాజశేఖర్‌రెడ్డి

మూడు గంటలు ప్రశ్నించిన సీబీఐ అధికారులు

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వివేకానందరెడ్డి హత్యకేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు వివేకానందరెడ్డి కుమార్తె సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డిలను ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు సీబీఐ కార్యాలయానికి చేరుకున్న సునీత, రాజశేఖర్‌రెడ్డిలను రాత్రి ఏడుగంటల వరకు సీబీఐ అధికారుల బృందం పలు అంశాలపై ప్రశ్నించి, వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసినట్టు తెలిసింది. ఇప్పటికే ఓసారి రాజశేఖర్‌రెడ్డి సీబీఐ అధికారుల ఎదుట హాజరుకాగా, మంగళవారం మరోమారు హాజరయ్యారు. సునీత తొలిసారిగా కోఠిలోని సీబీఐ కార్యాలయానికి స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు వచ్చారు. వివేకానందరెడ్డి హత్యకు ముందు, తర్వాత కుటుంబ పరిస్థితులు, ఇతర అంశాలపై వారి వాంగ్మూలాన్ని సీబీఐ అధికారులు నమోదు చేసినట్టు సమాచారం. మరోవైపు వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితుడు (ఏ–1) గంగిరెడ్డి బెయిల్ రద్దుచేయాలని కోరుతూ హైకోర్టులో సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం విచారించిన న్యాయమూర్తి జస్టిస్ చిల్లకూర్ సుమలత.. తదుపరి విచారణను నేటికి (బుధవారానికి) వాయిదా వేశారు.

ఆత్మ గౌరవంతో 'లక్ష'ణంగా..

- జూన్ నాటికి లక్ష టిడ్కో ఇళ్ల పంపిణీ

సాక్షి, అమరావతి: పట్టణ పేదలు ఆత్మ గౌరవంతో సగర్వంగా జీవించేలా తీర్చిదిద్దిన టిడ్కో ఇళ్ల పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. మొదటి విడతగా ఇప్పటికే 48,416 టిడ్కో ఇళ్లను పంపిణీ చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రెండో దఫాలో మరో 40 వేలకు పైగా యూనిట్లను పట్టణ పేదలకు అందచేసేందుకు సిద్ధమైంది. జూన్ నాటికి మొత్తం లక్ష టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించేలా కార్యాచరణ రూపొందించారు. దశాబ్దాలుగా అద్దె ఇళ్లలో భారంగా గడిపిన బడుగు జీవులు అన్ని సదుపాయాలతో తీర్చిదిద్దిన టిడ్కో గృహాలకు యజమానులుగా మారుతుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం కావలి నుంచి మొదలయ్యే టిడ్కో ఇళ్ల పంపిణీ ప్రక్రియ జూన్ చివరి వరకు కొనసాగనుంది. కావలి మున్సిపాలిటీలో అన్ని వసతులతో పూర్తి చేసిన 2,112 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఈ నెల 29వతేదీన శ్రీకాకుళంలో 1,280 యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.

జూమ్‌లో.. కామ్‌గా | ఆధారాలు ధ్వంసం!

మార్గదర్శి యాజమాన్యం అర్ధరాత్రి 'మేనేజ్‌మెంట్'

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో ఉక్కిరిబిక్కిరి అవుతున్న చెరుకూరి రామోజీరావు (ఏ–1) కీలక ఆధారాలను మాయం చేసేందుకు విఫలయత్నం చేసినట్లు బహిర్గతమైంది. మార్గదర్శి బ్రాంచ్ కార్యాలయాల్లో కీలక ఆధారాలు, రికార్డులను గుట్టు చప్పుడు కాకుండా ధ్వంసం చేసినట్లు తాజాగా సీఐడీ అధికారులు గుర్తించారు. ఈ తతంగాన్ని హైదరాబాద్‌లోని మార్గదర్శి ప్రధాన కార్యాలయం నుంచే పర్యవేక్షించారని, అందుకోసం ఫోర్‌మెన్‌లతో ప్రత్యేకంగా జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు తేలింది. ఏ ఒక్కటీ ఆధారం దొరకకుండా రికార్డులు డిలీట్ చేయాలని మార్గదర్శి చిట్స్ బ్రాంచీల సిబ్బందిని ఆదేశించిన యాజమాన్యం జూమ్ మీటింగ్‌లో అర్ధరాత్రి దాకా ఈ వ్యవహారాన్ని పర్యవేక్షించినట్లు తేలింది. మరోవైపు గత డిసెంబర్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా తమ లావాదేవీలు దాదాపు స్తంభించిపోవడంతో గొలుసుకట్టు తరహా మోసాలకు అలవాటుపడిన మార్గదర్శి యాజమాన్యం కొత్త చిట్టీలు లేకపోవడంతో దిక్కులు చూస్తోంది. పాడుకున్న చిట్టీల మొత్తం కోసం చందాదారులు మార్గదర్శి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా.. రశీదు రూపంలో డిపాజిట్లు చేసిన వారిలో ఆందోళన నెలకొంది. తమ వివరాలు ఏమవుతాయోనన్న ఆందోళన ఖాతాదారుల్లో నెలకొంది.

అడ్డదారిలో.. గుట్టుగా

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమ వ్యవహారాల కేసులో తిమ్మిని బమ్మిని చేసేందుకు రామోజీరావు బరి తెగించారు. నిధుల మళ్లింపు, అక్రమ పెట్టుబడులు పెట్టినట్లు తేలడంతో కేసు దర్యాప్తును



తప్పుదారి పట్టించేందుకు అడ్డదారులు పట్టారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయాల్లో కీలక ఆధారాలు, రికార్డులను ధ్వంసం చేయించారు. దర్యాప్తులో ఉన్న కేసుకు సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేయకూడదన్న నిబంధనను అతిక్రమించారు. గతంలో కూడా మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట రామోజీరావు అక్రమంగా రూ.2,600 కోట్ల డిపాజిట్లు వసూలు చేసినట్లు 2006లో బయటపడింది. నాడు రిజర్వు బ్యాంకు ఆదేశాలతో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో సీఐడీ విభాగం మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై కేసు నమోదు చేసింది. దీంతో డిపాజిట్లు వసూలు చేయడం తమ తప్పిదమేనని రామోజీరావు అంగీకరించారు. ఆ కేసు దర్యాప్తులో ఉండగానే మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ఆయన హఠాత్తుగా మూసివేశారు. ఇప్పుడు మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో కూడా అదే తరహాలో రికార్డులను నాశనం చేసే ప్రక్రియను గుట్టు చప్పుడు కాకుండా ముగించారు.

అర్ధరాత్రి విధ్వంసం.. జూమ్‌లో పర్యవేక్షణ

మార్గదర్శి కార్యాలయాల్లో సోదాలను సీఐడీ అధికారులు విస్తృతం చేయడంతో బెంబేలెత్తిన రామోజీరావు తనకు అలవాటైన రీతిలో ఆధారాలను ధ్వంసం చేసేందుకు సిద్ధపడ్డారు. అందుకోసం బ్రాంచి కార్యాలయాల మేనేజర్లతో (ఫోర్‌మెన్) మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం ప్రత్యేకంగా జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించింది. అక్రమ వ్యవహారాలకు సంబంధించిన పత్రాలు, రికార్డులు, ఇతర ఆధారాలను ఎలా ధ్వంసం చేయాలో వారికి క్షుణ్ణంగా వివరించారు. ఈ తతంగాన్ని హైదరాబాద్‌లోని మార్గదర్శి ప్రధాన కార్యాలయం నుంచే పర్యవేక్షించారు. ప్రధాన కార్యాలయానికి మళ్లించిన చందాదారుల నగదు వివరాలు, భారీగా నిధుల తరలింపు, రశీదుల ముసుగులో అక్రమ డిపాజిట్ల వసూలు, పాట పాడిన చందాదారులకు చిట్టీ మొత్తం ఇవ్వకుండా కొంత మొత్తాన్ని అక్రమ డిపాజిట్‌గా అట్టిపెట్టడం, యాజమాన్య వాటా కింద అట్టిపెట్టిన చిట్టీల టికెట్లు, వాటిపై చందా చెల్లించకుండానే చెల్లించినట్టుగా మాయ చేయడం.. వీటన్నింటికి సంబంధించిన రికార్డులు, పత్రాలను ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లోనూ ఎలా ధ్వంసం చేయాలో మార్గదర్శి ప్రధాన కార్యాలయ అధికారులు బ్రాంచి మేనేజర్లకు వివరించారు. ఆధారాల ధ్వంసం ప్రక్రియను ప్రధాన కార్యాలయం నుంచే అర్ధరాత్రి వరకూ పర్యవేక్షించారు. సీఐడీ అధికారులు తాజాగా నిర్వహించిన సోదాల్లో ఈ వ్యవహారం బహిర్గతం కావడంతో తీవ్రంగా పరిగణిస్తున్నారు. ధ్వంసం చేసిన ఆధారాలు, ఆన్‌లైన్ రికార్డులను సీఐడీ విభాగం రిట్రీవ్ చేసింది.

డిసెంబర్ నుంచి కొత్త చిట్టీలు లేవు

మార్గదర్శి అక్రమ వ్యవహారాలు వెలుగులోకి రావడంతో కొత్త చిట్టీలు వేసేందుకు చందాదారులు ముందుకు రావడం లేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయాల్లో ఆర్థిక కార్యకలాపాలు 2022 డిసెంబర్ నుంచి దాదాపుగా స్తంభించిపోయాయి. కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని చిట్ రిజిస్ట్రార్ స్పష్టం చేస్తుండగా రామోజీరావు ఆ చట్టాన్ని ఏనాడూ పట్టించుకోలేదు. దీంతో కొత్త చిట్టీలు ఆగిపోయాయి. స్టాంపులు–రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల సోదాల్లో బయటపడిన వివరాల ప్రకారం రాష్ట్రంలో మార్గదర్శి 37 బ్రాంచి కార్యాలయాల్లో రూ.273 కోట్ల వేలం టర్నోవర్‌తో 2,357 చిట్టీలను నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా రూ.6.29 కోట్లు వేలం టర్నోవర్ విలువ ఉన్న 148 కొత్త చిట్టీలను ప్రారంభిస్తారు. వాటిపై మార్గదర్శి యాజమాన్యానికి కమీషన్ రూపంలోనే రూ.31.45 లక్షల వస్తాయి. డిసెంబర్ నుంచి చందాదారులు ముందుకు రాకపోవడంతో ఏకంగా 1,200కుపైగా కొత్త చిట్టీలు ప్రారంభం కాలేదు. రూ.51 కోట్ల వేలం టర్నోవర్ ఉన్న చిట్టీలు నిలిచిపోయాయి. ఆ మొత్తాన్ని మ్యూచ్‌వల్ ఫండ్స్, షేర్ మార్కెట్‌లతోపాటు తమ సొంత సంస్థల్లో పెట్టుబడిగా మళ్లించేందుకు సాధ్యం కావడం లేదు. ఇక కమీషన్ రూపంలో రూ.2.55 కోట్ల మేర మార్గదర్శి యాజమాన్యానికి రాకుండా పోయింది. కొత్త చిట్టీల కోసం చందాదారులను రప్పించేందుకు బ్రాంచి మేనేజర్ల ద్వారా చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు.

చందాదారుల ప్రదక్షిణలు... డిపాజిట్‌దారుల్లో ఆందోళన

గతేడాది డిసెంబర్ నుంచి కొత్త చిట్టీలు ప్రారంభం కాకపోవడంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో మనీ సర్క్యులేషన్ నిలిచిపోయింది. పాత చిట్టీల చందాదారులు చెల్లించిన మొత్తాన్ని రామోజీరావు అక్రమంగా తమ సొంత సంస్థల్లో పెట్టుబడులుగా మళ్లించేశారు. రశీదు రూపంలో సేకరించిన అక్రమ డిపాజిట్లను మ్యూచ్‌వల్ ఫండ్స్, షేర్ మార్కెట్‌లో పెట్టుబడిగా పెట్టారు. కొత్త చిట్టీలు ప్రారంభమైతే ఆ చందాదారులు చెల్లించే మొత్తాన్ని పాత చిట్టీలు పాడిన వారికి చెల్లిస్తుంటారు. గడువు తీరిన అక్రమ డిపాజిట్ల విత్‌డ్రాయల్స్ మొత్తంగా చెల్లించడం, వడ్డీలు చెల్లించడం మొదలైన వ్యవహారాలు నిర్వహించేవారు. ప్రతి చిట్టీలోనూ యాజమాన్యం వాటా కింద అట్టిపెట్టుకున్న టికెట్ల చందా మొత్తాన్ని కూడా అవే నిధుల్లో చెల్లించినట్టు రికార్డుల్లో మాయ చేసేవారు. ఈ గొలుసు కట్టు తరహా మోసాన్ని దశాబ్దాలుగా చేస్తున్నారు. ఇప్పుడు కొత్త చిట్టీలు లేనందున మార్గదర్శి లావాదేవీలు నిలిచిపోయాయి. పాత చిట్టీలు పాడిన చందాదారులకు సకాలంలో చెల్లించడం లేదు. తాము ష్యూరిటీ సంతకాలన్నీ చేయించినా చిట్టీ మొత్తం చెల్లించకపోవడంతో చందాదారులు ఆందోళన చెందుతున్నారు. మార్గదర్శి కార్యాలయాల చుట్టూ మండుటెండల్లో ప్రదక్షిణలు చేస్తున్నారు. విజయవాడలోని లబ్బీపేట, విశాఖపట్నంలోని సీతంపేట, గుంటూరు అరండల్‌పేట బ్రాంచి కార్యాలయాలకు వచ్చి రిక్త హస్తాలతో వెనుదిరుగుతున్నారు. దీనిపై కొందరు చిట్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదులు కూడా చేస్తుండటం గమనార్హం. మరోవైపు గతంలో చిట్టీలు పాడిన మొత్తాన్ని వారికి చెల్లించకుండా రశీదు ఇచ్చి అక్రమంగా డిపాజిట్లు సేకరించారు. మార్గదర్శి అక్రమాలు బయటపడటంతో ఆ డిపాజిట్‌దారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమ డిపాజిట్ మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని, వడ్డీ లేకపోయినా అసలైనా ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. బ్రాంచి కార్యాలయాల నుంచి సరైన స్పందన లేకపోవడంతో వారిలో ఆందోళన తీవ్రమవుతోంది. కొందరు సీఐడీ అధికారులను కూడా సంప్రదించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను నమ్మి తమ కష్టార్జితాన్ని ధారపోసి నిండా మునిగిపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా నిబంధనలు పాటిస్తే ఈ పరిస్థితి తలెత్తేది కాదని, ప్రతి చిట్‌కూ ఓ బ్యాంకు ఖాతా ఉంటే జాప్యానికి ఆస్కారమే ఉండదని, నిధుల మళ్లింపు జరగకుంటే చిట్‌దారులకు చెల్లింపులు ఆలస్యమయ్యేవి కావని అధికారులు పేర్కొంటున్నారు.

'ర్యాపిడో' బైకర్ వికృత చేష్టలు

- భయపడి బైక్ నుంచి దూకిన యువతి
- గాయాలు అవ్వడంతో ఆస్పత్రికి తరలింపు
- బెంగళూరులో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

బనశంకరి: ర్యాపిడో బైకర్ లైంగిక వేధింపుల నుంచి తప్పించుకోవడానికి బైకు నుంచి కిందకు దూకిన యువతి గాయపడిన ఘటన బెంగళూరులో ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే... బాధితురాలు (30) ప్రైవేటు ఆర్కిటెక్ట్‌గా పనిచేస్తోంది. ఈ నెల 21న రాత్రి 11.30 గంటల సమయంలో ఇందిరానగర్‌కు వెళ్లడానికి ర్యాపిడో బైక్‌ను యాప్‌లో బుక్ చేసింది. యువతిని పికప్ చేసుకున్న బైకర్ ఆమె మొబైల్‌ను లాక్కుని, కౌగిలించుకుని వెకిలిచేష్టలు చేశాడు. వెళ్లాల్సిన చోటుకు కాకుండా వేరే మార్గంలో తీసుకెళ్తుండగా యువతి అతడిని ప్రశ్నించింది. సమాధానం ఇవ్వకుండా మరింత వేగంగా బైక్‌ను పోనిచ్చాడు. పైగా అతడు మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. భయాందోళనకు గురైన ఆమె బీఎంఎస్ ఇన్‌స్టిట్యూట్ వద్ద బైకు నుంచి దూకడంతో గాయపడింది. ఒక స్నేహితురాలికి, అలాగే పోలీసులకు కాల్ చేసి సాయం అడిగింది. అయితే పోలీసులు ఇది ప్రేమికుల గొడవ అనుకుని స్పందించలేదని బాధితురాలు తెలిపింది. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. చివరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని ర్యాపిడో బైకర్‌ను అరెస్ట్ చేశారు. అతనిపై కిడ్నాప్, వేధింపులు, లైంగికదాడికి యత్నం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

శ్రీవారి ఆలయ పరిసరాల్లో హెలికాప్టర్ల చక్కర్లు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయానికి సమీపంలో మంగళవారం మూడు హెలీకాప్టర్లు చక్కర్లు కొట్టాయి. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రం, పరకామణి భవనం, బాలాజీనగర్ ఉపరితలంపై వెళ్లాయి. తిరుమల శ్రీవారి ఆలయం మీదుగా విమానాలు, హెలికాప్టర్లు వెళ్లకూడదనేది ఆగమశాస్త్ర నిబంధన. అందుకే రాష్ట్రపతి, ప్రధానమంత్రి వంటి ప్రముఖులు, వివిధ దేశాల అధ్యక్షులు వచ్చే తిరుమలలో హెలిప్యాడ్ నిర్మించాలన్న ప్రతిపాదనల్ని కూడా పక్కనపెట్టి ఆగమ శాస్త్రానికే టీటీడీ పెద్దపీట వేసింది. ఆగమ పరంగానే కాకుండా భద్రత పరంగాను తిరుమలను నో ఫ్లైజోన్‌గా ప్రకటించాలని టీటీడీ కేంద్రం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో తిరుమలలో హెలికాప్టర్ల ప్రయాణంపై విజిలెన్స్ అధికారులు రేణిగుంటలోని విమానాశ్రయం ఏటీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

జిల్లా వార్తలు

ఉత్పత్తిలో అగ్రభాగాన మెయిన్ వర్క్‌షాప్




సమావేశంలో మాట్లాడుతున్న జీఎం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని మెయిన్ వర్క్‌షాప్‌లో గతేడాది(2021–22)తో పోలిస్తే 2022–23 ఆర్థిక సంవత్సరంలో అధిక ఉత్పత్తి జరిగింది. ఈమేరకు ఎనిమిది వేలకు పైగా బెల్ట్ కన్వేయర్స్ రోల్స్ ఉత్పత్తి చేసినట్లు వర్క్‌షాపు జీఎం గణపతిరావు తెలిపారు. వర్క్‌షాప్‌లో డీజీఎం రాజీవ్ కుమార్ అధ్యక్షతన మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో జీఎం మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం రూ.10.46 కోట్ల లాభం సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వర్క్‌షాపు ఉద్యోగులు, సిబ్బందిని ఆయన అభినందించారు.

నేడు ఉమ్మడి జిల్లాలో పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ముదిగొండ, ఖమ్మం, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, కొత్తగూడెం, కల్లూరు మండలాల్లోని పలుగ్రామాల్లో జరి గే కార్యక్రమాల్లో పాల్గొంటారని క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి తెలిపారు.

29న 'నవోదయ' ప్రవేశపరీక్ష



కూసుమంచి: ఖమ్మం జిల్లా పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 29వ తేదీన పరీక్ష జరగనుంది. ఉదయం 11.30 గంటలకు ప్రారంభం కానుండగా, 10.30గంటలకల్లా విద్యార్థులు ఆధార్ కార్డు లేదా నివాస ధృవీకరణ పత్రం, పరీక్షప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ పెన్నుతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ చంద్రబాబు సూచించారు. కేంద్రంలోకి చేతి గడియారాలు, క్యాలిక్యులేటర్లు, ఇతర ఎల్రక్టానిక్ పరికరాలు అనుమతించబోమని చెప్పారు. కాగా, హాల్‌టికెట్లను www.navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని, సందేహాలు ఎదురైతే 77021 57196, 98484 02281 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కాగా, ప్రవేశపరీక్ష కోసం 4,308 అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా ఉమ్మడి జిల్లాలో 19 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆకాంక్షలను అపహాస్యం చేసేలా..

- తూతూ మంత్రంగా జాబ్‌మేళాలు, ఉపాధి
- ఫలితంగా శ్రమదోపిడీకి గురవుతున్న యువత
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఇక్కట్లు

ఇల్లెందురూరల్: ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనుల జీవన ప్రమాణాల్లో మార్పు తీసుకురావడం, ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఐటీడీఏలను ఏర్పాటుచేసింది. వీటిని ద్వారా ఏజెన్సీ ప్రజలకు సౌకర్యాలు కల్పించడమే కాక విద్యా, ఉపాధి మార్గాల్లో అవకాశం కల్పించాలి. ఇక యువతకు నచ్చిన రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశం కల్పించేందుకు ఐటీడీఏలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఈ విభాగం ద్వారా యువతకు శిక్షణ ఇచ్చి జాబ్‌మేళాల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఉపాధి మార్గం వారి శ్రమ, జీవితంలో స్థిరపడాలన్న ఆకాంక్షను అపహాస్యం చేసేలా మారింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వేతనాలు అందక నెల, రెండు నెలల వ్యవధిలోనే ఇంటి బాట పడుతున్నారు. మళ్లీ వారికి కూలీ పనులే దిక్కవుతున్నాయి.

అధికారుల పర్యవేక్షణ లోపం

ఇల్లెందులో ఏర్పాటైన యూత్ ట్రైనింగ్ సెంటర్(వైటీసీ) ద్వారా 45 రోజుల అనంతరం జామ్‌మేళాలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ఐటీడీఏ అధికారులపై ఉంటుంది. యువత ఉద్యోగంలో చేరాక కూడా తరచుగా ఆయా సంస్థను సందర్శించి ఉపాధి అవకాశాలను పరిశీలించాలి. ప్రస్తుతం అలా జరగకపోగా.. కూలీల తరహాలో యువతను పంపిస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. దీంతో కంపెనీ బాధ్యులు రెండు, మూడు నెలలకే ఇంటికి పంపిస్తున్నారు.



ఇల్లెందులోని యూత్ ట్రైనింగ్ సెంటర్


శిక్షణను విస్మరించి పనులు

ఇల్లెందు వైటీసీలో సోలార్ ఎరక్షన్‌పై యువతకు శిక్షణ ఇచ్చారు. అంటే సోలార్ ఎక్విప్‌మెంట్ బిగించే విధానాన్ని నేర్పించినట్లు చెబుతూ ఉపాధి కల్పించారు. బొబ్బిలి, హైదరాబాద్‌ల్లో యువతకు ఉపాధి కల్పించగా.. అక్కడ వారితో గుంతలు తవ్వించడం, సామగ్రి మోయించడం వంటి పనులు మాత్రమే చేయించారు. దీంతో నివ్వెర పోవడం యువత వంతైంది.

వేతనాలు అధికారుల ఖాతాల్లోకి..

ప్రభుత్వం తరఫున నిర్వహించిన శిబిరాల్లో శిక్షణ తీసుకున్నాక ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకున్న యువతకు వేతనాలు ఆయా సంస్థలు నేరుగా చెల్లించాలి. ఇందుకోసం అకౌంట్ల వివరాలు సేకరించి జమ చేయడం లేదంటే నేరుగా చెల్లించడమే చేయాలి. కానీ ఐటీడీఏలో నిర్వహించిన జాబ్‌మేళా ద్వారా ఉపాధి పొందిన వారి వేతనాలను అధికారుల అకౌంట్లలో జమ చేయడం అనుమానాలకు తావిస్తోంది. కాగా, వైటీసీలో శిక్షణ పొందిన పలువురు యువతలకు హైదరాబాద్‌లో ఉపాధి చూపించగా.. నెలకే సంస్థ నిర్వాహకులు తిప్పి పంపించారు. పని చేసిన కాలానికి కూడా వేతనం రాకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక యువతులు ఆవేదన చెందుతున్నారు.


వేతనం తగ్గించారు



పదో తరగతి అర్హతతో ఐటీడీఏలో శిక్షణ ఇచ్చి ఉపాధి చూపిస్తానంటే చేరాను. శిక్షణ పూర్తయ్యాక బొబ్బిలో రెండు నెలల పాటు పనిచేశా. ఆతర్వాత ఇంటికి పంపించేశారు. నెలకు రూ.12,300 వేతనం ఇస్తామన్న వారు ఇప్పుడు రూ.11వేలు ఇస్తామంటున్నారు. అందులోనూ రూ.8వేలే అందాయి.

–పూనెం సందీప్, సుభాష్‌నగర్, ఇల్లెందు మండలం

అధికారుల అకౌంట్‌లో వేశామన్నారు



ఇల్లెందు వైటీసీలో సోలార్ ఎరక్షన్ అంశంపై శిక్షణ తీసుకున్నా. మాకు బొబ్బిలిలో ఉపాధి కల్పించగా రెండు నెలల తర్వాత ఇంటికి పంపారు. విధుల్లో ఉన్న సమయంలో రూ.5వేలు వాడుతున్నాను. మిగతా వేతనం అధికారుల ఖాతాల్లో జమ చేశామంటున్నా ఇక్కడ అడిగితే సమాధానం చెప్పడం లేదు.

–పాయం రవీందర్, కరకగూడెం, మణుగూరు మండలం

కాలానుగుణంగా ఉద్యోగుల్లో మార్పు రావాలి

మణుగూరుటౌన్: మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగులు మారుతు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని టీఎస్ ఆర్టీసీ ఖమ్మం రీజనల్ మేనేజర్ ఎస్టేర్ ప్రభులత సూచించారు. మణుగూరు డిపోలో మంగళవారం ఉద్యోగులకు ఏర్పాటుచేసిన 'టాక్ట్' శిక్షణలో ఆమె మాట్లాడారు. ఆర్టీసీలోని ప్రతీ ఉద్యోగి ప్రయాణికులకు సేవలందిస్తూనే సంస్థ అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. కాలానుగుణంగా మార్పు చెందని సంస్థలు కాలగర్భంలో కలిసిపోయాయని పేర్కొన్నారు. ఈనేపథ్యాన ఉద్యోగుల్లో మార్పు వస్తే ఆర్టీసీ వేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అనంతరం యూనియన్ బ్యాంక్ మణుగూరు బ్రాంచి మేనేజర్ మన్మధరావు, డిపో మేనేజర్ టి.స్వామి పలు అంశాలపై మాట్లాడారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కనకదుర్గ, ఉద్యోగులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఆర్ఎం ప్రభులత

రేపు 'నిధి ఆప్ కే నిఖత్'

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్ఓ)ఆధ్వర్యాన ఈనెల 27న 'నిధి కే ఆప్ నిఖత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎండీ.సలీంఖాన్ తెలిపారు. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమంలో సందేహాలు ఉన్న ఉద్యోగులు, పెన్షనర్లు సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా వాసులు పాత మున్సిపాలిటీ కార్యాలయంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులు పాల్వంచలోని పాత మున్సిపాలిటీల్లోని తమ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

పేదలకు అండగా ఎర్రజెండా

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ఖమ్మంరూరల్/నేలకొండపల్లి: పేదలకు అండగా నిలవడమే కాక వారి సమస్యల పరిష్కారానికి ఎర్రజెండా పోరాడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెల్లడించారు. ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడులో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు, సాగునీరు, తాగునీరు, పంటల గిట్టుబాటు ధరల కోసం పోరాడిన చరిత్ర కమ్యూనిస్టులదని తెలిపారు. అప్పటి శ్రీరాంసాగర్, ఇప్పటి సీతారామ ప్రాజెక్టుల కోసం పాదయాత్ర చేసినట్లు గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో మతోన్మాద శక్తులను ఎదుర్కొనేందుకు లౌకిక పార్టీలతో జతకడతామని ఆయన తెలిపారు. అనంతరం పలు ప్రాంతాల్లో అకాల వర్షాలతో నష్టపోయిన పంటలను పరిశీలించిన ఆయన వరి ఎకరాకు రూ.30వేలు, మామిడికి రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.రమేష్, నంద్ర ప్రసాద్, ఏ.రామయ్య, వి.సుదర్శన్‌రెడ్డి, సత్యనారాయణ, రత్నం, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా,




సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రం

తమ సర్వీసు క్రమబద్ధీకరించే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యాన పలువురు తమ్మినేనిని కలిసి విన్నవించారు. కాగా, నేలకొండపల్లి మండలంలోని చెన్నారం, కోరట్లగూడెం, బోదులబండల్లో కూడా పర్యటించిన తమ్మినేని వీరభద్రం పార్టీ సమావేశాల్లో మాట్లాడారు. దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న బీజేపీని రానున్న ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు బండి రమేష్, పిట్టల రవి, కే.వీ.రెడ్డి, రచ్చా నర్సింహారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, కట్టెకోల వెంకటేశ్వర్లు, బెల్లం లక్ష్మి, పెద్దిరాజు నర్సయ్య, గుగులోత్ వీరునాయక్, ఇంటూరి అశోక్, బలుసు హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 5 నుంచి నిరవధిక సమ్మె..

- ప్రభుత్వానికి రేషన్ డీలర్ల జేఏసీ హెచ్చరిక
- గౌరవ వేతన సాధనకు హనుమకొండలో భారీ ర్యాలీ

హన్మకొండ చౌరస్తా: ఈఏడాది జూన్ 5వ తేదీలోగా గౌరవ వేతనం ప్రకటించకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘాల ఐక్యవేదిక బాధ్యులు హెచ్చరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రేషన్ డీలర్ల సమావేశం మంగళవారం హనుమకొండ రెడ్డికాలనీలో నిర్వహించారు. తొలుత సుమారు రెండువేల మంది రేషన్ డీలర్లు కాకతీయ యూనివర్సిటీ జంక్షన్ నుంచి సభా ప్రాంగణం వరకు డప్పు చప్పుళ్లు, కళాకారుల ఆటపాటలతో ర్యాలీగా వచ్చారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సంక్షేమ పథకాలను చేరవేస్తున్నామని తెలిపారు. చాలీచాలనీ కమీషన్లతో బతకలేక వడ్డీకి డబ్బు తీసుకొచ్చి పెట్టుబడిగా పెడుతూ రేషన్ షాపులను నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య భద్రత, పని భద్రత లేక ఎన్నో అవమానాలను భరిస్తున్నామని అన్నారు. తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ నాయకోటి రాజు మాట్లాడుతూ.. ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి వచ్చే ప్రతీ బస్తాకు కేజీ నుంచి మూడు కేజీల బియ్యం తక్కువగా ఉండడంతో నిర్వహణ ఇబ్బందిగా మారిందన్నారు. ఈ సమావేశంలో దొమ్మాటి రవీందర్, మల్లికార్జున్‌గౌడ్, హనుమండ్లు, యాదగిరి, కిరణ్, మోహన్‌నాయక్, రవి, రాధాకృష్ణ, చిలగానీ మోహన్, పోతరాజు రమేష్, బత్తుల మహేష్, విజయపాల్, సమ్మయ్య, గౌరీశంకర్, వెంకటేశ్వర్లు, శ్రీను, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బత్తుల రమేష్‌బాబు



కేయూ జంక్షన్ నుంచి ర్యాలీగా వస్తున్న రేషన్ డీలర్లు

తీర్మానాలు..

రేషన్ డీలర్ల సమావేశంలో పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రభుత్వం డీలర్లకు కనీస గౌరవ వేతనం రూ.30వేలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు నెలల కమీషన్ వెంటనే ఇప్పించాలని, డీలర్ చనిపోతే దహన సంస్కారాలకు రూ.30వేలు ఇవ్వడమే కాక హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఇంకా గోదాం నుంచే 3, 4 కిలోల బియ్యం తక్కువగా వస్తున్నందున తమపై 6/ఏ విజిలెన్స్ కేసులు పెట్టొద్దని, రెండేళ్లకోసారి చేపట్టే ఆథరైజేషన్ రెన్యూవల్‌ను ఐదేళ్లకు పెంచాలని, ఉన్నత విద్యావంతులైన రేషన్ డీలర్లకు శాఖాపరమైన పదోన్నతులు కల్పించాలని, ఐదేళ్లగా షాపులు నిర్వహిస్తున్న తాత్కాలిక డీలర్లను రెగ్యులరైజ్ చేయడంతో పాటు హైదరాబాద్‌లో వెయ్యి గజాలు, జిల్లా కేంద్రాల్లో 500 గజాల స్థలంలో రేషన్ భవనం నిర్మించాలని తీర్మానించారు.